క్లుప్తంగా

గీత కార్మికులను ఆదుకోవాలి



ముత్తుకూరు: ప్రమాదవశాత్తు చనిపోయిన కల్లు గీత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గౌడ కల్లు గీత పారిశ్రామిక సంఘం, జిల్లా గౌడ సేవా సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తూర్పునాగలదొరువుకు చెందిన గీత కార్మికుడు కాల్తిరెడ్డి ఏడుకొండలు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతుడి భార్య సునీతమ్మకు రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, అధ్యక్షుడు తోట ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నడవడి ముత్యంగౌడ్, ఉపాధ్యక్షులు ఉప్పాల రామకృష్ణయ్యగౌడ్, దద్దోలు రామచంద్రయ్యగౌడ్, పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

వెంకటాచలం: లారీ బోల్తా పడడంతో డ్రైవర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో బుధవారం వేకువన చోటు చేసుకుంది. వివరాలు..నెల్లూరు నుంచి గూడూరు వైపునకు వెళుతున్న లారీ కాకుటూరు సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీటీ, వీఆర్వోల బదిలీ

మనుబోలు: మండల డిప్యూటీ తహసీల్దార్ బాట కోటమ్మ, కాగితాలపూరు వీఆర్వో రమేష్ బదిలీ అయ్యారు. డీటీ బాలకోటమ్మను కోవూరు మండల సీఎస్‌డీటీగా బదిలీ చేశారు. కాగితాలపూరు వీఆర్వో రమేష్‌ను ఇందుకూరుపేట మండలం లేబూరు బిట్-1 వీఆర్వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు రూరల్ మండలం పడారుపల్లి వీఆర్వో గండాల తేజను కాగితాలపూరుకు వీఆర్వో నియమించారు.

కుక్కలకు రేబిస్ టీకాలు

ఇందుకూరుపేట: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు ఏడీ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలతోపాటు వీధి కుక్కలకు సైతం టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : మరుపూరులో నూతనంగా నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, అనపల్లి జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

తోటపల్లిగూడూరు: అపరిష్కృత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పొట్లపూడి పంచాయతీలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్షలో భాగంగా సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. ఈ నెల 27వ తేదీ వరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్) మండల కన్వీనర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే

పొదలకూరు : మొగళ్లూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ) డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులతో బొమ్మలు గీయించడం, తయారు చేయించడం , తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆరోపణలపై చర్చకు సవాల్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో నిర్వహించిన సభలో టీడీపీ నేత నారా లోకేశ్ తనపై ఆరోపణలు చేశారని.. దీనిపై వివరణిచ్చి చర్చకు రావాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సవాల్ విసిరారు. నగరంలోని 42వ డివిజన్లో గల హుందా వీధి, సిటిజన్ స్కూల్ వీధి, దర్గా వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను రూ.వెయ్యి కోట్లు సంపాదించానంటూ ఆరోపణలు చేశారని.. అందులో రూ.50 కోట్లు లేదా తన తండ్రి ఇచ్చిన ఆస్తి కంటే ఒక్క రూపాయి ఎక్కువ సంపాదించినా వెంకటేశ్వరస్వామి వద్ద ప్రమాణానికి సిద్ధమని చెప్పారు. ఎక్కడెక్కడో ఉండే ఆస్తులన్నీ తనవేనన్నారని, చర్చకు రావాలని సవాల్ విసిరినా రాలేదని విమర్శించారు. డాక్యుమెంట్లు చూపి తన బినామీ పేర్లను లోకేశ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇస్కాన్ సిటీ, గూడూరుకు సంబంధించి ఏవేవో డాక్యుమెంట్లు చూపించారని, వాటిని తీసుకొస్తే వాటి యజమానులు తన్ని తీసుకెళ్తారని చెప్పారు. తన తండ్రి ఎంత ఇచ్చారు.. వాటిని ఎలా పోగొట్టుకున్నాననే లెక్కలు.. ప్రస్తుతం తనకున్న ఆస్తులను చూపిస్తానని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ట్రై స్కూటర్ల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పది మంది దివ్యాంగులకు ట్రై స్కూటర్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ బుధవారం అందజేశారు. నగరంలోని రాజన్న భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరికి ట్యాబ్‌లు, ఫోన్లను సైతం అందజేయనున్నామని వివరించారు. దివ్యాంగులకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, బీసీ సెల్ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్ర, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులను కల్పించాలని బీజేవైఎం కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

శాకంబరిగా రాజరాజేశ్వరి దర్శనం రేపు

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా శుక్రవారం దర్శనమివ్వనున్నారని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రైతు బజార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బోడిగాడితోట ఫీడర్‌లో రోడ్డును వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను మార్చనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో సరఫరా గురువారం ఉండదని టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(బృందావనం): దీర్ఘకాల వ్యాధిగ్రస్తులైన 20 మందికి పౌష్టికాహారాన్ని కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ ట్రస్ట్‌లో ట్రస్ట్ నిర్వాహకుడు నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత, డాక్టర్ ప్రియాంక, విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, క్రాంతికుమార్, మధు, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో ధ్వజస్తంభానికి పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి విశేష పూజలను బుధవారం నిర్వహించారు. ధ్వజస్తంభం కాస్త ఒరిగి ఉండటంతో దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీసులు, స్థానిక అధికారుల సమక్షంలో తొలగింపు పనులు చేపట్టారు. ఆలయ చెర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ధ్వజస్తంభ దాత కాకాణి నరహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

నెల్లూరు(క్రైమ్): బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన సమీపంలో తన ఇంట్లో 15 ఏళ్ల బాలిక ఈ నెల రెండో తేదీన ఒంటరిగా ఉండగా, అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి పెద్దగా కేకలేయడంతో శ్రీహరి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయాన్ని తన తల్లిదండ్రులకు బాలిక తెలియజేసింది. వారు తమ బంధువుల దృష్టికి తీసుకెళ్లి ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజుకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పరిశ్రమలకు మిగులు నీటి సరఫరా



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కృష్ణపట్నం పోర్టు, ఇతర పరిశ్రమల అవసరాలకు నగరపాలక సంస్థ నుంచి మిగులు మంచినీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలువురు అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఎన్జీటీ మార్గదర్శకాలను అనుసరించి నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ జలాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ రిపోర్టును రూపొందించాలని సూచించారు. పరిశ్రమల నిర్వహణకు రోజూ అవసరమైన నీటి సరఫరా అంచనాలను తెలుసుకోవాలని కోరారు. దీనికి అనుగుణంగా ముత్తుకూరులోని పరిశ్రమలకు సరఫరా చేసేలా చూడాలని చెప్పారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య పనులను ముందస్తుగా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్, హెల్త్ విభాగాధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరకుండా డ్రెయిన్ల ద్వారా ప్రవాహం సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులను చేపట్టాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన పారిశుధ్య నిర్వహణ చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. డివిజన్లలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ క్లీనింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు.

ప్రమాదభరితంగా చెట్టు



నెల్లూరు(బారకాసు): నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల సమీపంలో ఎండిపోయిన పెద్ద చెట్టు ప్రమాదభరితంగా మారింది. ఇది పడితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యార్థులు, రాకపోకలు సాగించే వారు ఆందోళన చెందుతున్నారు. భారీ గాలులు వీస్తే చెట్టు విరిగిపడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్టును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా హౌసింగ్ కార్పొరేషన్ డే



మాట్లాడుతున్న నాగరాజు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ, జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బందికి క్రీడా పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం రెడ్‌క్రాస్‌లో 21 మంది రక్తదానం చేశారు. హౌసింగ్ పీడీ నాగరాజు, కావలి ఈఈ రంగవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్‌ను విజయవాడలోని వారి కార్యాలయాల్లో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు మల్లు రామ్మోహన్‌రెడ్డి, గూడంశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఇంటింటా సంక్షేమం



డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న గౌరి

నెల్లూరు(బారకాసు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే ఇంటింటా సంక్షేమమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. డివిజన్లో చేపట్టిన డ్రెయిన్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. రోడ్లు, డ్రెయిన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి.. మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నానని తెలిపారు.

మెరుగైన వైద్యానికే ఫ్యామిలీ డాక్టర్

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజలకు మెరుగైన వైద్యాన్ని సకాలంలో అందించాలనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, దీనిపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేసి చికిత్సను అందించాలని సూచించారు. ఎన్సీడీ సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బిడ్డల జననాన్ని నమోదు చేసి చైల్డ్ ఐడీని కేటాయించాలని చెప్పారు. గర్భిణుల వివరాలను పీహెచ్‌సీల్లో నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, వృద్ధులకు నేత్ర పరీక్షలు, ఆపరేషన్లను త్వరగా చేపట్టాలన్నారు. క్రిటికల్ కేసుల విషయంలో డాక్టర్లు సరైన నిర్ణయం తీసుకొని ఏరియా ఆస్పత్రి లేదా నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేయాలని చెప్పారు.

దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులకు అభినందన

రక్తహీనత గల గర్భిణికి సకాలంలో వైద్యసేవలను అందించిన దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యులు వనజ, సయ్యద్‌ను కలెక్టర్ అభినందించారు. అనంతరం వీరికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో కనులపండువగా బుధవారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వేడుకగా జరిపారు. అన్నమయ్య సంకీర్తనలు, గోవిందనామ స్మరణతో మందిరం పులకించింది. ఉభయకర్తలుగా చిత్తూరు వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, వేణుబాబు, మాలకొండయ్య, రజనీకాంతమ్మ, నిర్మలమ్మ, అరుణమ్మ, వాసుకి, శరణ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): పదో తరగతి పరీక్షల్లో 500, ఇంటర్‌లో 900కు పైగా మార్కులను సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నాయీబ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో పురస్కారాలను ఆగస్టు 8న అందజేయనున్నామని తెలిపారు. వివరాలకు 94404 52541, 99633 24585 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల బంద్ విజయవంతం



నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్ జిల్లాలో బుధవారం విజయవంతమైందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలలను స్వచ్ఛందంగా మూసేయగా, మరికొన్నింటిని ఏబీవీపీ ఆధ్వర్యంలో మూయించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, నేతలు చందు, రాహుల్, నరసింహ, సాయి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డికాలనీ నుంచి భగత్‌సింగ్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను అధికారులు బుధవారం తొలగించారు. జేసీబీ సాయంతో తొలగించి చదును చేశారు. కాగా మరికొన్ని ఆక్రమణలను తొలగించాలనే యత్నాన్ని పలువురు అడ్డుకున్నారు.

శాలివాహన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(మినీబైపాస్): పదో తరగతి, ఇంటర్‌లో 8.5 జీపీఏకుపైగా సాధించిన శాలివాహన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని కుమ్మర శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు నరసయ్య, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. అంబాపురంలోని శాలివాహన సంఘ కల్యాణ మండపంలో ఈ నెల 16న కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ



మాట్లాడుతున్న నరసింహారావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘాల కమిటీ సమావేశాలను నగరంలో సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నామని పేర్కొన్నారు. సీఐటీయూ నేతలు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, చాంద్‌బాషా, రెహనాబేగం, కిన్నెరకుమార్, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

పండ్లు, పలకల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రెడ్‌క్రాస్‌లోని మానసిక దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, పలకలను విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆమె భార్య కుసుమ, కుమార్తె హరిత వీటిని పంపిణీ చేశారు. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.